# సరికొత్త స్నేహ వారధిని నిర్మిద్దాం!





ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

## సార్క్ శిఖరాగ్ర సభ

ఇటీవల దక్షిణాసియా ప్రాంతీయ సహకార మండలి (సార్క్) 17వ శిఖరాగ్ర సభ మాల్దీవుల్లో జరిగింది. 'నూతన స్నేహ వారధిని నిర్మిద్దాం' అనే నినాదంతో శిఖరాగ్ర సభ ముగిసింది. సార్క్ గతం, వర్తమానం, భవిష్యత్తుల మధ్య వారధి నిర్మించాలి. దీనిక గత 26 ఏళ్లుగా సార్క్ సాధించిన విజయాలే పునాది కావాలి. ఈ ప్రాంతం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు నూతన అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలి. ఆసియా ఖండానికే పరిమితం కాకుండా మొత్తం ప్రపంచంతోనే మంచి స్నేహ సంబంధాలను ఈ ప్రాంతం అభివృద్ధి చేసుకోవాలి. ఆర్థికంగా ఈ ప్రాంతం సమీకృతం అయ్యేందుకు సార్క్ తన ప్రయత్నాలకు మరింత పదును పెట్టాలి, వేగిరపరచాలి. ఆసియాలోని వివిధ దేశాల మధ్య వస్తువుల రవాణా వేగంగా జరిగేందుకు సమర్థమైన రవాణ, కమ్యూనికేషన్ మార్గాలను నెలకొల్పాలి. ఆసియా దేశాల మధ్యే కాకుండా ఆసియా నుంచి ఇతర ప్రాంతాలు, దేశాలకు మధ్య కూడా ఇలాంటి మార్గాల నిర్మాణం జరగాలి. ఇతర ప్రాంతీయ కూటములతో సంబంధాలు పెట్టుకోవడం, ఆవిర్భవిస్తున్న ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం కావడం ద్వారా మాత్రమే ఈ ప్రాంత ప్రజల సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని సార్క్ విశ్వసిస్తోంది. సార్క్ 17వ శిఖరాగ్ర సభ నినాదమైన 'నూతన వారధులను నిర్మిద్దాం'లో ఇమిడి ఉన్న సందేశం ఇదే.

### వాణిజ్య సంబంధాల ప్రాధాన్యం

ప్రస్తుత సార్క్ శిఖరాగ్ర సభ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యం కారణంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కుంటున్న సమయంలో జరిగింది. ఈ పరిణామాలు సార్క్ శిఖరాగ్ర సభను ఉద్దేశించి భారత ప్రధానే అన్నట్లు అభివృద్ధి చెందుతున్న సార్క్ లాంటి దేశాలపై తాజాగా, అది కూడా ఊహించని భారాలను మోపాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోలుకోవడానికి మరింత సహాయపడేలా ప్రయత్నించాలి. ఈలోగా సార్క్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు మాత్రం పెట్టుబడులు, మార్కెట్ల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ముఖ్యంగా ఎగుమతులు దెబ్బతింటాయి. ఈ దేశాలు ద్రవ్యపరమైన ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే నూతన అవకాశాల కోసం సృజనాత్మక అన్వేషణ అవసరం. ముఖ్యంగా పెట్టుబడి, వృద్ధికి కావాల్సిన నూతన అవకాశాల కోసం సార్క్ లాంటి దేశాలు అన్వేషణ జరపాలి. సార్క్ దేశాల వాణిజ్య సంబంధాలను పూర్తిగా సాధారణ స్థితికి తీసుకురావడం ఈ దిశగా చేయాల్సిన మొదటి పని. ఇదే జరిగితే పరస్పర ప్రయోజనకరమైన రీతిలో సార్క్ దేశాల మధ్య వాణిజ్య వృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఏర్పడతాయి. కానీ, దక్షిణాసియాలోని దేశాల మధ్య వాణిజ్య సంబంధాలకు ప్రధాన అడ్డంకి ఆర్థిక కారణాలు కావు. కేవలం రాజకీయ కారణాలవల్లే ఈ వాణిజ్య సంబంధాల్లో ఆశించిన ప్రగతి కనిపించడంలేదు. వాస్తవానికి రాజకీయ వివాదాలకు పరిష్కారం చూపడంలో కూడా వాణిజ్య సంబంధాలు దోహదం చేస్తాయి. భారత్, చైనా సంబంధాల్లో పురోగతి ఇదే విషయాన్ని తెలియజేస్తోంది. ఈ ప్రాంతంలో సృష్టించిన సంపద ఇదే ప్రాంతంలో పెట్టుబడిగా మారేందుకు అవసరమైన వాతావరణాన్ని ఏర్పాటుచేసేందుకు కృషి చేయాలని సార్క్ శిఖరాగ్ర సభలో భారత ప్రధాని మన్మోహన్ సింగ్ వ్యాఖ్యానించారు. సరిహద్దుల్లేని బలమైన ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి సమష్టి దృక్పథం అవసరం అవుతుంది. ఈ విషయంలో భారతదేశానికే ప్రత్యేక పాత్ర ఉంది. ఈ ప్రాంత భౌగోళిక స్వభావం, ఆర్థిక వ్యవస్థ, మార్కెట్ స్వభావం నుంచే భారతదేశ పాత్ర మనకు అవగతమవుతుంది.

### ప్రధాన పాత్ర భారత్‌దే

దక్షిణాసియా ప్రాంతీయ సహకార కూటమిలో భారత్ అతి పెద్దదేశం. భౌగోళికంగానే కాకుండా ఆర్థిక వ్యవస్థ పరిమాణం రీత్యా లేదా వృద్ధి రేటు దృష్ట్యా కూడా భారతే అతి పెద్ద దేశం. వాస్తవానికి సార్క్ దేశాల్లో ముఖ్యంగా చిన్న దేశాలకు సంబంధించి భారత్ పెద్దన్న పాత్ర పోషిస్తుందన్న అపోహ కలగకుండా చేయాలంటే సార్క్ ఆర్థిక, వాణిజ్య ఏకీకరణలో కూడా భారత్ కీలకమైన, ఉదారమైన పాత్రను నిర్వహించాలి. భారత్ ఇప్పటికే ఈ దిశగా కొన్ని చర్యలను ప్రకటించింది. భారత ప్రభుత్వ వాణిజ్య సరళీకరణ ఇటీవల కీలకమైన నోటిఫికేషన్‌ను జారీచేసింది. దక్షిణాసియా స్వేచ్ఛా వాణిజ్య ప్రాంతంలోని అతి తక్కువ అభివృద్ధి చెందిన దేశాలకు సంబంధించినంత వరకు సెన్సిటివ్ లిస్టులోని టారిఫ్ లైన్స్‌ను ప్రస్తుతం ఉన్న 480 నుంచి 25కు తగ్గించారు. దీంతో సెన్సిటివ్ లిస్టు నుంచి తొలగించిన అన్ని వస్తువుల దిగుమతులపై సున్నా శాతం కస్టమ్స్ సుంకం ఉంటుంది. అంటే ఈ వస్తువులను కస్టమ్స్ సుంకం నుంచి పూర్తిగా మినహాయిస్తారు. అయితే ఇప్పటికీ వాణిజ్యానికి వాణిజ్యేతర ఆంక్షలు సమస్యగానే ఉన్నాయి. భారతదేశం దక్షిణాసియా ప్రాంతంలోని స్వేచ్ఛాయుతమైన, సమతుల్యతతో కూడిన వాణిజ్యానికి కట్టుబడి ఉంది. దక్షిణాసియా దేశాల్లో ఒక్కోదానికి ఒక్కోరకమైన ప్రత్యేకత ఉంది. జలవిద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలు, సహజ వనరుల అందుబాటు, రవాణా మార్గాల ద్వారా లబ్ధిపొందటానికి ఉన్న అవకాశాలు, సముద్ర జలవనరులు, శాస్త్ర సాంకేతిక సదుపాయాలు, సామర్థ్యాలు, యువశక్తితో కూడిన జనాభా మొదలైనవి ఇలాంటి ప్రత్యేకతలకు కొన్ని ఉదాహరణలు. భవిష్యత్తులో ఇవి పెట్టుబడులకు, వినిమయానికి ఊతాన్నిస్తాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే పెట్టుబడుల ప్రవాహంపై ఒప్పందానికి తుది రూపం ఇచ్చే ప్రక్రియను సార్క్ వేగవంతం చేయాలి.

### కీలక చొరవ

సార్క్ 17వ శిఖరాగ్ర సభ నినాదం 'నూతన వారధులను నిర్మిద్దాం'. ఇప్పటికే ఈ దిశగా కొన్ని ప్రయత్నాలు మొదలయ్యాయి. ఉదాహరణకు దక్షిణాసియా దేశాల్లోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో గత ఏడాది 'సార్క్ ఫోరం' ఏర్పాటైంది. వివిధ సార్క్ దేశాల నుంచి




భారతదేశంలోని నాలుగు మెట్రోపాలిటన్ నగరాలకు, మరో 18 ప్రదేశాలకు విమాన యాన సర్వీసులను ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించాలని 2005లో ఢాకా సదస్సులో భారతదేశం ప్రతిపాదించింది. ఆ తర్వాత విమానయాన సదుపాయాల్లో కొంత పురోవృద్ధిని సాధించారు. కానీ, ఇంకా చాలా అభివృద్ధి జరగాల్సి ఉంది. ఈ దిశగా ప్రాంతీయ విమానయాన సేవల ఒప్పందం కుదరాలి. దీనికోసం, వచ్చే ఏడాది అధికారుల స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని భారతదేశం సార్క్ ఈ సభలో ప్రతిపాదించింది. అదేవిధంగా ప్రాంతీయ రైల్వే ఒప్పందం, మోటార్ వాహన ఒప్పందాన్ని అంగీకరించాలనే ప్రతిపాదనలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఈ ఒప్పందాలు ఆమోదం పొందే విషయంలో అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. భారతదేశం, మాల్దీవులు, శ్రీలంక దేశాలు ప్రాంతీయ జల రవాణా సర్వీసులను అభివృద్ధి చేసే దిశగా ప్రయత్నిస్తున్నాయి. ఈవిధంగా అనేక రకాలుగా దేశాల మధ్య సంధానాన్ని పెంచే చర్యలను ఈ ఉపఖండంలో మరిన్ని తీసుకోవాలి. ఈ ప్రాంతంలోని తపాలా సేవలను సమన్వయం చేస్తూ దక్షణాసియా పోస్టల్ యూనియన్ ఏర్పాటుకు అంగీకారం కుదిరింది. భారతదేశంలో ఈ యూనియన్ తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. భారతదేశంలోని పోస్టల్ స్టాఫ్ కాలేజ్‌లో సార్క్ దేశాల సిబ్బందికి శిక్షణ సదుపాయాలను కల్పిస్తారు. పోస్టల్ యూనియన్ మాదిరిగానే సార్క్ దేశాల మధ్య టెలికమ్యూనికేషన్ ఒప్పందం కుదరాలని భారతదేశం మాల్దీవుల్లోని అడ్డూలో జరిగిన 17వ శిఖరాగ్ర సభలో సూచించింది. ఈ ఒప్పందంలో భాగంగా కాల్ రేట్లను, టారిఫ్‌లను తగ్గించాలి. టెలికమ్యూనికేషన్ కనెక్టివిటీ నాణ్యతను మెరుగుపరిచేందుకు దక్షిణాసియా ప్రాంతంలో టెలీకమ్యూనికేషన్ రంగంలో మౌలిక వసతులను మెరుగుపరుచుకోవాలి. సార్క్ దేశాల ప్రజల మధ్యనున్న సాంస్కృతిక దూరాన్ని తగ్గించేందుకు ఈ ప్రాంతంలోని దేశాల మధ్య టెలివిజన్, సినిమా, బ్రాడ్‌కాస్టింగ్ రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకోవాలి. సార్క్ దేశాల మధ్య సమాచార లోపాలను అధిగమించుకోవాలి. ఈ దేశాలకు చెందిన ప్రజలు ఒకరినొకరు మరింతగా అవగాహన చేసుకోవడానికి అవసరమైన అన్ని కార్యక్రమాలను చేపట్టాలి. పర్యటక రంగం అభివృద్ధి చెందడానికి ఇది ఎంతగానో దోహదం చేస్తుంది.

### అడ్డూ ప్రకటన

సార్క్ 17వ శిఖరాగ్ర సభ మాల్దీవుల్లోని అడ్డూలో నవంబరు 10, 11వ తేదీల్లో జరిగింది. ఇందులో సార్క్‌లోని సభ్యదేశాలైన అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, భారతదేశం, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక, పాకిస్థాన్ దేశాల అధినేతలు పాల్గొన్నారు. ఈ శిఖరాగ్ర సభ ఆమోదించిన తుది ప్రకటనను 'అడ్డూ ప్రకటన' అని పిలుస్తారు. ఈ సభలో ఆస్ట్రేలియా, చైనా, ఇరాన్, జపాన్, కొరియా, మారిషస్, మయన్మార్, అమెరికా, యూరోపియన్ యూనియన్‌లకు చెందిన పరిశీలకులు పాల్గొన్నారు.

'వారధులను నిర్మిద్దాం' అనేది ఈ సభ సందేశం. దీని సారాంశం సార్క్ దేశాల మధ్యనున్న అభిప్రాయ భేదాలను అధిగమించాల్సిన ప్రాధాన్యాన్ని గుర్తించాలి. సభ్యదేశాల మధ్య మెరుగైన అవగాహన కల్పించాలి. సార్క్ దేశాల మధ్య స్నేహాన్ని, పరస్పర ప్రయోజనకరమైన సమగ్ర సహకారాన్ని పెంపొందించాలి. ప్రజల మధ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు వివిధ దేశాల మధ్య రాకపోకలను మెరుగుపరిచేందుకు అవసరమైన కనెక్టివిటీలను, అభివృద్ధిని పెంచాలి. ఈ ప్రాంతంలో పెట్టుబడులను, వాణిజ్యాన్ని పెంపొందించాలి. ప్రజాస్వామ్యం, శాంతి, పరస్పర గౌరవం, విశ్వాసాన్ని పెంచే చర్యలు, మానవ హక్కులు, సుపరిపాలన, స్వేచ్ఛ, మొదలైన ఉదాత్త లక్ష్యాలకు మరోసారి తమ నిబద్ధతను తెలియజేస్తున్నట్లు అడ్డూ ప్రకటన పేర్కొంది. పేదరికాన్ని నిర్మూలించడం, ఆదాయ అసమానతలను తగ్గించడం, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం, సుస్థిర అభివృద్ధిని సాధించడం లాంటి అంశాలకు కట్టుబడి ఉన్నామని అడ్డూ ప్రకటన ద్వారా సార్క్ దేశాలు పునరుద్ఘాటించాయి.

తీవ్రవాదం, దాని అన్ని రకాల వికృత రూపాల పట్ల సార్క్ శిఖరాగ్ర సభ తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. మత్తుపదార్థాల అక్రమ రవాణాతో సహా అన్ని రకాల అంతర్జాతీయ నేరాలు, ఇతర సంఘటిత నేరాల పట్ల సార్క్ ఆందోళన చెందుతోంది. చిన్న ఆయుధాల అక్రమ రవాణా, సముద్ర మార్గాల్లో పెరుగుతున్న నేరాలను అరికట్టాలని, దక్షిణాసియాలో వాతావరణ మార్పుల ప్రభావంతో ఏర్పడుతున్న పర్యావరణపరమైన నష్టాలను నివారించాలని సార్క్ 17వ సభ పిలుపునిచ్చింది.

### భవిష్యత్ ప్రణాళిక

దక్షిణాసియా ప్రాంతంలో సహకారాన్ని పెంపొందించడానికి ఇప్పటికే వివిధ రకాల యంత్రాంగాలు, వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. వీటిని మరింత సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. తద్వారా ప్రాంతీయ సహకారాన్ని విస్తరించుకోవాలి. సార్క్ దేశాలు ప్రకృతి వైపరీత్యాలకు వేగంగా స్పందించేందుకు అవసరమైన ఒప్పందంపై సంతకాలు చేశాయి. సార్క్ దేశాల స్థాయిలో విత్తన బ్యాంకును ఏర్పాటుచేసే ఒప్పందంపై కూడా సంతకాలు జరిగాయి. ప్రాంతీయ ప్రమాణాల అమలుకు సంబంధించిన ఒప్పందంపై కూడా సంతకాలు జరిగాయి. ఈ పరిణామాలను అడ్డూ ప్రకటన స్వాగతించింది. ఈ ప్రాంతంలో సరైన ఆర్థిక సహకారాన్ని ఏర్పాటు చేయాలంటే దక్షిణాసియా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (సాఫ్టా)ను పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని అడ్డూ ప్రకటన మరోసారి గుర్తు చేసింది.

దక్షిణాసియా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని సమర్థంగా, పూర్తిగా అమలు చేయడానికి అవసరమైన చర్యలను తీసుకోవాల్సిందిగా సార్క్ శిఖరాగ్ర సభ మంత్రుల స్థాయి మండలిని ఆదేశించింది. దీనివల్ల, వాణిజ్యపరమైన ఆంక్షలను తొలగించడానికి వీలవుతుంది. వాణిజ్యేతర ఆంక్షలను కూడా తొలగించేందుకు సాఫ్టా కృషి చేస్తోంది. ప్రమాణాలు, కస్టమ్స్ నిబంధనల మధ్య సమన్వయాన్ని తీసుకొస్తారు. సార్క్ దేశాల మధ్య ద్రవ్య పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచేందుకు, దీర్ఘకాల పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాల్సిందిగా సార్క్ శిక్షరాగ్ర సభ సభ్యదేశాల ఆర్థిక మంత్రులను ఆదేశించింది. 2012లో సార్క్ వాణిజ్య, పర్యటక ఉత్సవాలను మాల్దీవుల్లో నిర్వహిస్తారు. సార్క్ 12వ వాణిజ్య ఉత్సవం జరుగుతుంది. దక్షిణాసియా ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేందుకు అవసరమైన కార్యక్రమాలను చేపడతారు. దీంట్లో సంబంధిత ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వాములను చేస్తారు. హిందూ మహాసముద్ర సరుకు, రవాణా, ప్రయాణికుల సేవలను (ఇండియన్ ఓషియన్ కార్గో అండ్ ప్యాసెంజర్ ఫెర్రీ సర్వీస్)ను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను చేపడతారు. వాతావరణ మార్పులపై గతంలో ఆమోదించిన టింపూ ప్రకటన సత్వర అమలుకు కృషిచేస్తారు.

ఇంధన రంగంలో వివిధ దేశాల మధ్య సహకారానికి, ఒప్పందం కుదిరేందుకు కృషి చేస్తారు. ప్రాంతీయ విద్యుత్ పంపిణీ, సార్క్ విద్యుత్ మార్కెట్ భావనలపై అధ్యయనం చేస్తారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు సార్క్‌లోని ఆయా దేశాలు తమ జాతీయాదాయంలో కొంత భాగాన్ని పునరుత్పత్తి ఇంధన వనరుల అభివృద్ధికి వెచ్చిస్తాయి. సార్క్ ఆహార బ్యాంక్‌కు సంబంధించి అమల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడం ద్వారా దీన్ని మరింత సమర్థంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తారు. తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి, మత్తు పదార్థాల, చిన్న ఆయుధాల అక్రమ రవాణాను నిరోధించడానికి వివిధ సార్క్ దేశాలు పరస్పర సహకారంతో కృషి చేస్తాయి. దక్షిణాసియా ప్రాంతంలో సముద్రజల నేరాలను (పైరసీ) ఎదుర్కొనేందుకు చర్యలు ప్రారంభిస్తారు. ఈ ప్రాంతంలో మహిళా సాధికారత సాధించేందుకు, లింగ వివక్షను తగ్గించేందుకు అవసరమైన ప్రాంతీయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడానికి నిపుణుల బృందాన్ని నియమిస్తారు. పారిశుద్ధ్యం, తాగునీటిని అందించడంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తారు. ఈ దేశాల మధ్య విద్యా ప్రమాణాల్లో సమన్వయాన్ని సాధిస్తారు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల మధ్య దీర్ఘకాల సహకారాన్ని పెంపొందిస్తారు.

ఈ కార్యాచరణ ప్రణాళికను, 17వ శిఖరాగ్ర సభలో తీసుకున్న నిర్ణయాలను అమలుచేస్తే, సార్క్ బలమైన ప్రాంతీయ కూటమిగా రూపుదిద్దుకుంటుంది.

(రచయిత జర్నలిజం అధ్యాపకులు, కాలమిస్టు)